# అర్థం కాని మనిషి

-సి.ఎం.అనూరాధ

"అది అంతేనే! ఎప్పటికీ నాకు అర్థం కాదు, నీవు కూడా తనని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించకు" స్వప్న ప్రతిమతో నా గురించి అన్న మాటలు నాకేం బాధ కలిగించలేదు. నిజానికి మనిషి ముందుగా తనని తాను అర్థం చేసుకోగలిగితే కదా, ఇతరులను అర్థం చేసుకోగలిగేది. తనని తాను అర్థం చేసుకోలేని వాళ్ళు ఎదుటివారినెలా అర్థం చేసుకోగలరు? కాలంతోపాటు అంతులేకుండా పరిగెడుతూ, ఎటుపోతున్నామో మన గమ్యమేమిటో కూడా తెలుసుకోకుండా వెళ్ళిపోతుంటారు స్వప్నలాంటి కొందరు.

ఆ పరుగు కాస్త ఆపి నిదానంగా మనలోకి మనం తొంగి చూస్తే ప్రతి మనిషి తను కోల్పోతున్నదేమిటో, పొందుతున్నదేమిటో, తన పరుగు ఎందాకో అర్థమవుతుంది. అంత తీరికా, ఓపికా చాలామందిలో కనిపించవు. ఎంత డబ్బు సంపాదిస్తున్నాం, ఎంత మిగిలిస్తున్నాం అని కాకుండా ఎంత సుఖంగా, ఎంత తృప్తిగా, ఎంత ప్రశాంతంగా, ఎంత మంచిగా ఉండగలుగుతున్నాం అని ఆలోచించగలిగితే ఈ పరుగులు తగ్గి ప్రతి మనిషి జీవితంలో ఆనందం వెల్లివిరుస్తుంది.

నా ఆలోచనల్లోనే ఇల్లు వచ్చేసింది. తలుపు తీసి, వంట పూర్తి చేసి పిల్లల కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాను. తిరిగి ఒక్కసారి ఉదయం జరిగిన సంఘటన గుర్తు చేసుకున్నాను.. ఉదయం మార్కెట్‌కని బయలుదేరాను. కాస్త దూరం వెళ్ళగానే "వందనా! ఏయ్ వందూ!" ఎవరో నన్నే పిలుస్తున్నట్లు అనిపించి వెనక్కి తిరిగి చూశాను.

ఒక్క క్షణం ఆశ్చర్యం ఆనందం చుట్టుముట్టాయి. నా చిన్ననాటి స్నేహితురాళ్ళు స్వప్న, ప్రతిమ.

"ఎన్నాళ్ళయిందే నిన్ను చూసి" ఆనందంగా అంది ప్రతిమ.

మేమంతా చిన్నప్పుడు ఒకే స్కూల్లో చదువుకున్నాం. పెద్దయి, పెళ్ళిళ్ళయిన తర్వాత ఎవరి దారి వారిదయింది. ఎప్పుడో ఇలా కలవడం, స్వప్న మాత్రం ఇదే ఊళ్ళో ఉంటుంది. అప్పుడప్పుడూ కలుస్తూంటుంది. ప్రతిమ బొంబేలో ఉంటుంది. అది అనంతపూర్ రావడం చాలా తక్కువ.

ప్రక్కనే ఉన్న జ్యూస్ సెంటర్‌కెళ్ళి జ్యూస్ త్రాగుతూ కాసేపు మాట్లాడుకున్న తర్వాత వాళ్ళని మా ఇంటికి రమ్మని ఆహ్వానించి నేను బయలుదేరబోయాను.

ప్రతిమ చటుక్కున అంది "అవునూ! మీవారు పెద్ద బ్యాంకు ఆఫీసర్ కదా! మరి నువ్వేంటే అలా! ఈ కాటన్ చీర ఏంటి, ఇలా నడుచుకుంటూ రావడమేంటే! హాయిగా కారు తీసుకోవచ్చుగా! డబ్బుండగానే సరిపోదే! అనుభవించాలి"

నేను నవ్వి బయలుదేరాను. నా వెనకగా స్వప్న అన్న మాటలు నా చెవిదాటి పోలేదు.

"అది అంతేనే! ఎప్పటికీ నాకు అర్థం కాదు! నీవు కూడా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించకు" అని.

నిజానికి స్వప్న అన్నట్లు నేను అర్థంకాని మనిషినా! ఎందువల్ల తను అలా అనుకుంటుందో నాకు తెలియదు. నా జీవన విధానం తనకు ఎప్పుడూ నచ్చదు. నేను చేసే ఎన్నో పనులు తనకి నచ్చవు.


జీవితం క్రమబద్ధంగా ఉండాలని నేననుకుంటాను. పిల్లల్ని ఉదయమే నిద్రలేపి, కాసేపు వ్యాయామం చేయించి, పెందళాడే స్నానం చేయించి, పూజ చేయిస్తాను. ఆ తర్వాతే చదువుకోమని చెప్తాను. చదువుకంటే ముందు మంచి నడవడిక ఉండాలని నా ఉద్దేశ్యం. 'మార్నింగ్ ఫ్రెష్ అవర్స్‌ని అలా వేస్ట్ చేయకపోతే లేవగానే చదివించవచ్చు కదా" అని స్వప్న అంటుంది. స్కూల్ నుంచి రాగానే పిల్లలకు రిలాక్సేషన్ కోసమని ఏదో ఒక ఫైన్ ఆర్ట్స్ నేర్చుకోమని చెప్పాను. పెద్దమ్మాయి సంగీత మ్యూజిక్, చిన్నమ్మాయి సాహిత్య పెయింటింగ్ సెలెక్ట్ చేసుకున్నారు. ఈ విషయంలో కూడా స్వప్న పూర్తిగా నాకు ఆపోజిట్. పిల్లల్ని 24 గంటలూ ఎంతసేపూ చదివించడమే జీవిత ధ్యేయంగా పెట్టుకుంది.

స్వప్న పిల్లలు, ప్రతిమ పిల్లలు, నా పిల్లలు దాదాపుగా ఒకే వయస్సు. మా వారిది ట్రాన్స్‌ఫరబుల్ జాబ్ కనుక పిల్లల్ని సెంట్రల్ స్కూల్‌లో చేర్పించాం. ఈ స్కూల్‌లో ఉన్న ఒకే ఒక డ్రాబ్యాక్ తెలుగు పాఠ్యాంశంగా లేకపోవడం. మాతృభాష చదవడానికి, వ్రాయడానికి రాకపోతే ఇక అంతకంటే అవమానమేముంటుంది? అందువల్ల నేనే పిల్లలకు ఇంట్లో తెలుగు నేర్పిస్తున్నాను. తెలుగులోని దేశ భక్తి గీతాలు, ప్రత్యేకంగా సేకరించి పిల్లలకు నేర్పిస్తుంటాను.

పసిపిల్లలు తమ తీయని గొంతుతో, "తేనెల తేటల మాటలతో" మన తెలుగు తల్లిని పొగుడుతూంటే తెలుస్తుంది. తేట తెనుగులోని తీయదనం, శంకరంబాడి వారి 'మా తెలుగు తల్లికి' వింటుంటే నిజంగా తనువు పులకించదా! మన తెలుగు తల్లి ఔన్నత్యాన్ని ఎంత గొప్పగా వర్ణించారు కవి. ఇవన్నీ మన పిల్లలకు అందించాలనుకోవడం నేరమా! మా పిల్లలకు ఇంగ్లీష్ తప్ప తెలుగు రాదు అని చెప్పుకునేవారిని చూస్తే

నిజంగా జాలేస్తుంది.

స్వప్న సి.బి.యస్.సి సిలబస్‌లో కోక్కరిక్యులార్ ఆక్టివిటీస్ ఎక్కువగా ఉన్నాయని, చదువు తక్కువగా ఉందని పాపను సెంట్రల్ స్కూల్ నుంచి పేరున్న ఒక ప్రయివేట్ స్కూల్‌లో మార్చేసింది. ఇక అప్పటినుంచీ పాపకి ఎప్పుడూ చదువే లోకమయింది. ప్రతిరోజూ టెస్ట్‌లు, అసైన్‌మెంట్స్. ఒక్కక్షణం తీరిక దొరికేది కాదు. స్వప్నకి పాప 24 గంటలూ చదువుతుండడం ఎంతో ఆనందాన్ని కలిగించింది. నేను పిల్లల్ని ఎక్కువసేపు చదివించనని, ఎక్కువగా ఆడుకోవడానికి పంపిస్తానని తనకి నాపై కోపం. తెలుగు నేర్పించడం కోసం అనవసరంగా టైమ్ వేస్ట్ చేస్తున్నానని తన అభిప్రాయం. ఇవన్నీ కూడా తనకి నేను అర్థం కాకపోవడానికి కొన్ని బలమైన కారణాలు. పసిబిడ్డలు చదువును ఆనందంగా ఆడుతూ పాడుతూ చదవాలిగానీ చదువే ఓ శిక్షలా ఉండకూడదని నా అభిప్రాయం.



ఇంకో విషయంలో కూడా నా ఫ్రెండ్స్‌కి నేను అర్థంకాని మనిషిని. జీవితాన్ని సింపుల్‌గా ఆడంబరంగా లేకుండా జీవించడం నా కిష్టం. మన స్టేటస్‌కు తగ్గట్లు ఆడంబరంగా ఉండాలంటారు వాళ్ళు. ఇల్లంతా రకరకాల ఫర్నిచర్‌తో నింపడం స్వప్నకు ఇష్టం. అది మా ఇంటికి వచ్చినప్పుడంతా నన్ను తిడుతూనే ఉంటుంది.

ఇంట్లో ఫర్నిచర్ తక్కువగా ఉందని. ఇల్లంటే ప్రశాంతంగా అలసి వచ్చిన మనల్ని సేద తీర్చేలా ఉండాలే కానీ ఫర్నిచర్‌తో క్రిక్కిరిసి ఫర్నిచర్ షాప్‌లా ఉండకూడదని నేననుకుంటాను. ఇదే విషయం స్వప్నతో చెప్పి ఇది నా అభిప్రాయం మాత్రమే అని చెప్పాను.

ఇలా ఎన్నో విషయాలలో, దాదాపు ప్రతి విషయంలోనూ భిన్నాభిప్రాయాలతో స్వప్నతో నా స్నేహం కొనసాగుతోంది.

చూస్తుండగానే కాలం గడిచిపోతోంది. మా అందరి పిల్లలు పెద్దవారయ్యారు. స్వప్న, ప్రతిమ తమ పిల్లలని బి.టెక్, ఐ.ఐ.టి మెడిసిన్ అంటూ రాత్రింబవళ్ళూ చదివించి అనుకున్నది సాధించారు. వాళ్ళ పిల్లలు కూడా కాంపిటేటివ్ స్పిరిట్‌తో చదివి ప్రొఫెషనల్ కోర్సులలో జాయిన్ అయ్యారు.

స్వప్న, ప్రతిమ ఎన్నోరోజుల తమ తపస్సు ఫలించిందన్నారు. నా పిల్లలకు నేనెప్పుడూ ఒకే మాట చెప్పేదాన్ని. "మీరు మీకు ఇంట్రస్ట్ ఉన్న ఏ కోర్సు అయినా చేయండి. కానీ మనం చదివిన చదువుకు సార్థకత ఉండాలి. అది నలుగురికి ఉపయోగపడాలి. ఆ చదువు మీలో మంచీ, చెడు విచక్షణను పెంచాలి. చదువుతోపాటు మంచి సంస్కారం ఉండాలి. మన చదువు మనలని మానసికంగా మరియు నైతికంగా ఉన్నతులను చేయాలి'' అని నేను చెప్పిన మాటలు వృధాకాలేదు. మా పెద్దమ్మాయికి ముందునుంచీ సంగీతం పట్ల అభిమానం. అందువల్ల తను ఎమ్మే మ్యూజిక్ కంప్లీట్ చేసింది. తనకిష్టమైన సంగీతంలో తన ప్రతిభ నిరూపించుకుంది. మ్యూజిక్ టీచర్‌గా సెటిలయ్యింది.

అప్పుడప్పుడూ ప్రోగ్రామ్స్ కూడా ఇస్తూ ఆ డబ్బుని అనాధ శరణాలయాలకు డొనేట్ చేస్తుంటుంది. ఇక చిన్నమ్మాయికి సాహిత్యం మీద అభిలాష. తను సాహిత్యంలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేసి తర్వాత రిసెర్చ్ కూడా చేసి లెక్చరర్‌గా జాయినయ్యింది.

నా ఫ్రెండ్స్ మాత్రం పిల్లలను ఏ డాక్టర్‌నో, ఇంజనీర్‌నో చేయకుండా 'ఆర్డినరీ' చదువులు చదివించానని నన్ను దుమ్మెత్తి పోశారు. పదిమందికి చదువు చెప్పి వారిని సమాజానికి ఉపయోగపడే మంచి వ్యక్తులుగా తీర్చిదిద్దే ఉన్నతమైన ఉపాధ్యాయ వృత్తి వాళ్ళకి ఆర్డినరీగా కనిపించడం నాకు చాలా బాధ కలిగించింది. అంకిత భావంతో చేసే ఏ వృత్తి అయినా భగవంతుడి సేవతో సమానం అని చెప్పాను.

***

కాలం మరింతగా పరిగెడుతోంది. స్వప్న, ప్రతిమ తమ పిల్లలకు మెడిసిన్, ఐఐటిలు పూర్తికాగానే అమెరికాలో జాబ్ చేస్తున్న ఇంజనీర్లతో పెళ్ళి చేశారు.

"మా అమ్మాయిది నిజంగా అదృష్టమే! అమెరికా సంబంధం అంటే మాటలా! భగవంతుని దయ వల్ల మాకు కుదిరింది'' అంటూ మురిసిపోయారు. సేమ్ ప్రొఫెషన్ అయితే బావుంటుందని మేము పిల్లలిద్దరికీ టీచింగ్ ప్రొఫెషన్‌లోనే వున్న అబ్బాయిలతో పెళ్ళి చేశాము.

పెళ్ళికి వచ్చిన ఫ్రెండ్స్ నా గురించి అంటున్న మాటలు నాకేం బాధ కలిగించలేదు.

"పిల్లలని మంచి చదువులు చదివించలేదు. పోనీ మ్యారేజెస్ అయినా ఏ డాక్టర్‌నో, ఇంజనీర్‌నో చూసి

ఇవ్వొచ్చు కదా! బ్రతకలేక బడిపంతులు అని, ఇది అంతేనే! జీవితంలో ఎప్పుడూ మనకు అర్థం కాదు.'' నేను అలవాటుగా నవ్వి ఊరుకున్నాను.

***

దాదాపు పది సంవత్సరాలు గడిచాయి. పిల్లలు కూడా ఇదే ఊళ్ళో ఒకరు, దగ్గరలోనే ఒకరు ఉంటున్నారు. వారి అన్యోన్య దాంపత్యానికి చిహ్నలుగా వారి ముద్దు పాపలు. ఆ చిన్న పాటల ఆటపాటలతో, మాకు ఒంటరితనం అంటే ఏమిటో తెలీలేదు. ఈ వయసులో మన పిల్లలు మన దగ్గరే వుంటే ఎంతో అండగా వుంటుంది. పిల్లలు వృద్ధాప్యంలోకి అడుగిడిన మమ్మల్ని కంటికి రెప్పలా వారి పిల్లలతో సమానంగా చూసుకుంటున్నారు.

***

స్వప్న ఈమధ్య మా ఇంటికొచ్చింది. స్వప్న కూతురు, కొడుకు, ఇద్దరూ అమెరికాలోనే వున్నారు. పెళ్ళయిన పదేళ్ళలో ఒక్కసారి మాత్రమే వాళ్ళు ఇండియాకు వచ్చారట. ఓసారి స్వప్నకు ఆరోగ్యం బాగోలేక చూడాలనిపించి రమ్మని ఫోన్ చేస్తే లక్ష రూపాయలకు చెక్ పంపిస్తూ మంచి డాక్టర్ దగ్గర ట్రీట్‌మెంట్ తీసుకోమని తాము రావడానికి కుదరనీ చెప్పారట.

స్వప్న పోనీ నేనే అక్కడికి వస్తాను. పిల్లల్ని చూడాలనిపిస్తోంది అని కబురు చేసిందట.

“వద్దు మమ్మీ! నీవు ఇక్కడికి వస్తే నిన్ను ఎవరు చూసుకుంటారు. మేమిద్దరం ఆఫీస్‌కు వెళ్తాం కదా! అదీకాక ఇక్కడ ఇన్సూరెన్స్ చేయకుండా మెడికల్ ఫెసిలిటీస్ దొరకడం కష్టం. చాలా కాస్ట్ అవుతుంది'' అంటూ మెయిల్ చేశాడట స్వప్న కొడుకు.

దాదాపు అదే సమాచారం కూతురు నుంచి కూడా వచ్చిందట.

“వాళ్ళు డాలర్ల వేటలో పడ్డారే! ఇక మేము ఏం కనిపిస్తాం'' అంటూ బాధపడింది.

ఒంటరితనం స్వప్నను తనను తాను పరిశీలించుకోవడానికి ఉపయోగపడింది. అప్పుడు కానీ తనకు జీవితం సత్యాలు తెలిసిరాలేదు. తను అనారోగ్యంగా ఉందనీ, ఒక్కసారి రమ్మనీ బ్రతిమలాడినా పిల్లలు రాలేదు. తమ పిల్లల చదువులు పాడయితాయనీ, ఇండియాలలో పిల్లల ఆరోగ్యం పాడవుతుందనీ, తమ ఉద్యోగాలకు అభద్రత ఏర్పడుతుందనీ కారణాలు చెప్పున్నారు. కనిపెంచిన తల్లిదండ్రులకంటే డాలర్లు ఎక్కువయ్యాయి. విలాస జీవితం ఎక్కువయింది. డబ్బు మనుషులను ఇంత దూరం చేస్తుందా? అసలు ఇదంతా తమ పిల్లల తప్పా! లేక తమ పెంపకంలో లోపమా? వారి చదువుల కోసం తను కార్పొరేట్ కాలేజీలలో చేర్చి ఎంత ఖర్చుపెట్టి శక్తికి మించి చదివించింది. వాళ్ళని ఎన్ని రోజులు తను అర్ధరాత్రి వరకు మేలుకుని చదివించలేదు. చివరికి మిగిలింది ఇదా! ఈ హృదయ వేదనేనా'' అంటూ స్వప్న తమ మనసు విప్పి నాతో అన్ని విషయాలు చెప్పుకుని బాధపడింది.

నాకు తనని ఆ విధంగా చూస్తుంటే గుండె ద్రవించి పోయింది.

“చూడు స్వప్నా! జరిగిన విషయాలకు బాధపడకు! జరగబోయేది ఆలోచించు. నీకు గుర్తుందా! చిన్నప్పుడు మన పిల్లల బర్త్‌డేస్ ఎలా సెలబ్రేట్ చేసేవాళ్ళమో! నేను ఆ రోజు పిల్లలను అనాథ శరణాలయాలకు తీసుకెళ్ళి అక్కడి పిల్లలకు స్వీట్స్ పంచుతానని తెలిసి నన్నెంత కసురుకునేదానివి, ‘బర్త్‌డే రోజు కూడా ఆ రోగిష్టి మనుషుల దగ్గరకు తీసుకెళ్ళి పిల్లలకి రోగాలు అంటించేవే! నీ సమాజసేవ ఏమోగానీ!' అంటూ. నేనప్పుడే చెప్పాను. పిల్లల్లో సేవాతత్పరత, సాటి మానవుల పట్ల దయ పెంచడానికి ఇది ఉపయోగపడుతుందని, వేలు ఖర్చుపెట్టి గ్రాండ్‌గా పార్టీ ఇవ్వడం మన హోదాకు చిహ్నం కావచ్చు కానీ ఈ విధంగా చేయడం వల్ల ఆ చిన్ని మనసులలో అదే అభిప్రాయం పడిపోతుంది'' అని చెప్పాను. ఇంకో విషయం స్వప్నా! జరిగింది మర్చిపో! ఎప్పటికైనా నీ పిల్లల మనసు మారి వచ్చినప్పుడు రానీ! నీవు ఆధ్యాత్మిక విషయాలపై మనసు మళ్లించు, కాస్త హాయిగా ఉంటుంది. మా ఇల్లు నీ ఇల్లు అనుకో, ఎప్పుడైనా నీకు ఎప్పుడు రావాలనిపిస్తే అప్పుడు వస్తుండు. సంతోషంగానీ, దుఃఖంగానీ నేనున్నానంటూ పంచుకునే వారుంటేనే కదా జీవితానికి అర్థం''

నా మాటలతో స్వప్న చాలా వరకు స్థిమిత పడింది. తేలికైన మనసుతో తిరిగి వెళ్తూ అంది. రోజూ నాకు అలవాటైన వాక్యమే.

కాకపోతే కాస్త తేడాతో “ఇప్పుడు నీవు నాకు బాగా అర్థం అయ్యావు వందూ!''

★



## కృతజ్ఞత

తనకి హిందీలో హీరోయిన్‌గా తొలి అవకాశాన్నిచ్చిన షారుఖ్ ఖాన్ తోనే తన కెరీర్‌లో తొలి ఐటమ్ నంబర్ చేయబోతోంది దీపిక పదుకొనె. ‘ఓం శాంతి ఓం'తో దీపికను సంచలన తారగా పరిచయం చేసాడు షారుఖ్. మరి ఆమాత్రం విశ్వాసం ప్రదర్శించాల్సిందే కదా! ప్రియదర్శన్ దర్శకత్వం వహించే ఈ సినిమా ఓ మలయాళ సినిమాకి రీమేక్. అన్నట్టు ఇదే మలయాళ చిత్రమే రజనీకాంత్ హీరోగా ‘కుచేలుడు' పేరుతో తెలుగు, తమిళ భాషల్లో నిర్మాణమవుతోందిలెండి.

